ఒక మామూలు ఆడపిల్లలా కాకుండా అందుకు భిన్నంగా ఎలా ప్రవర్తించగలిగింది? అమృత పట్ల కృతజ్ఞతతో..ఇదీ అని నిర్వచించలేని మరేదో భావనతో సుధ మనస్సు నిండిపోగా..

అ..మృ..తా..స్నేహితురాల్ని కౌగలించుకుంది. ఒకరికి కుదిరిన సంబంధాలు చెడగొట్టి తమకి కుదుర్చుకునే స్నేహితులున్న ఈరోజుల్లో నీలాంటి స్నేహితురాలు, నీ స్నేహం దొరకటం నా అదృష్టం. నీ పేరే కాదు మనసు కూడా అమృతమయమే..కన్నీటితో అమృత భుజాన్ని తడిపేస్తోంది సుధ.

**-కె.విజయలక్ష్మి**

**(బాపట్ల)**

# పశ్చాత్తాపం

"సార్...మేనేజరుగారు ఈవిడ విషయం మిమ్మల్ని చూడమన్నారు" అటెండరు చంద్రయ్య మాటలు విని తలెత్తి చూశాను. ఆమెకు దాదాపు ముప్పై ఏళ్ళుండవచ్చు. ముఖంలో దైన్యం. దుస్తుల గురించి పట్టించుకొనే ఓపిక లేనట్లు నలిగిన దుస్తులతో ఉంది.

"కూర్చోండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీ చూపి "చంద్రయ్యా, నాయర్‌ను రెండు కాఫీలు పంపమను" అన్నాను అటెండర్‌తో.

ఆమె కూర్చుని "వచ్చే గురువారం మా ఆయనకు గుండె ఆపరేషన్. ఆయన ఓ ప్రైవేటు స్కూల్లో టీచరుగా పనిచేస్తున్నారు. నేనూ అదే స్కూల్లో పనిచేస్తున్నాను. ఆపరేషన్ ఖర్చు భరించే ఆర్థికస్థోమత మాకు లేదు. అందుకే మా ప్రిన్సిపాల్ సలహా మేరకు ఇలా అన్ని ఆఫీసులకు వచ్చి సహాయం అర్థిస్తున్నాను. మీ మేనేజరుగారిని కలిసాను. ఆయన మీతో మాట్లాడమన్నారు" అంటూ తను తెచ్చిన ప్లాస్టిక్ ఫోల్డర్ నుండి డాక్టర్ రిపోర్ట్స్ తీసి చూపించబోయింది ఆమె.

నేను మా బ్రాంచి కల్చరల్ సెక్రటరీగా ఉన్నంతకాలం ఇటువంటి విషయాల్ని మా బ్రాంచి మేనేజరు నాకు అప్పజెప్పేవారు. నేను వచ్చినవాళ్ళ వివరాలు అడిగి, వాళ్ళు చెప్పింది నిజమని నిర్ధారించుకొని, తర్వాత సర్క్యులర్ ద్వారా తోటి ఉద్యోగులందరినీ తమకు తోచినంత యివ్వమని కోరడం, వసూలయిన మొత్తాన్ని ఆ సహాయం అడిగినవారికి. అందించడం జరుగుతుండేది. అయితే ప్రస్తుతం మా బ్రాంచి కల్చరల్ సెక్రటరీ రామ్మూర్తి. ఆ విషయమే ఆమెకు చెప్పి బ్రాంచి మేనేజర్ అలవాటు చొప్పున నా దగ్గరకు పంపించారని, నాతో వస్తే రామ్మూర్తికి పరిచయం చేస్తానని చెప్పాను.

"ఆయనతో మీరు కాస్త చెప్పండి" అది దాదాపు ఏడుస్తూ.

"నేను చెబుతాను. మీరు ధైర్యంగా ఉండండి. మీవారికి నయమౌతుంది. ఆ భగవంతుణ్ణి నమ్ముకోండి. నమ్మిన వాళ్ళను ఆయన తప్పకుండా కాపాడుతాడు" అన్నాను.

ఇంతలో కాఫీలు రావడంతో యిద్దరం త్రాగాము.

తర్వాత ఆమెను రామ్మూర్తికి పరిచయం చేసి అందరినీ వీలైనంత ఎక్కువ మొత్తం విరాళంగా యివ్వమంటూ సర్క్యులర్ తయారు చేయమని చెప్పి నా సీటుకు వచ్చేశాను.

మరో గంటకు సర్క్యులర్‌తో అటెండరు నా దగ్గరికి వచ్చాడు. రామ్మూర్తి పంపిన సర్క్యులర్ అది. గుండె ఆపరేషన్ ఎంతో ఖర్చుతో కూడుకున్నది కాబట్టి మానవతా దృక్పథంతో సహాయం చెయ్యమని రామ్మూర్తి రాసి పంపాడు.

నాకు ఒక విషయం గుర్తొచ్చి నవ్వొచ్చింది. నేను గతంలో పంపిన అనేక సర్క్యులర్స్‌లో రామ్మూర్తి ఎంతో కొంత మొత్తం రాసేవాడు, సర్క్యులర్ చూసిన వాళ్ళకు అతనూ యిచ్చాడని తెలియడానికి. అయితే డబ్బులు మాత్రం యిచ్చేవాడు కాడు. అతని విషయం తెలియక



మొదట్లో అతనికి రెండుసార్లు డబ్బు విషయం నేను గుర్తుచేశాను. అతను ఏదో ఒక కారణం చెప్పి తప్పించుకొన్నాడు. అప్పట్నుంచీ అతన్ని డబ్బులు అడగటం మానుకొన్నాను. అతను పేరు రాయడం, డబ్బులు యివ్వకపోవడం అటెండర్లకూ అలవాటయిపోయింది. అతను రాసిన మొత్తం ఎదురుగా 'నాట్ పెయిడ్' అని రాసి, ఆ కాగితాన్ని ఫైల్ చేసుకోవడం నాకూ అలవాటయిపోయింది.

సర్క్యులర్‌లో రామ్మూర్తి పేరు కోసం వెతికాను. వంద రూపాయలు అతను యిచ్చినట్లు రాసి ఉంది.

"రామ్మూర్తి డబ్బులిచ్చాడా" అని అటెండర్ని అడిగాను.ఇచ్చాడని చెప్పాడు. 'దొంగచేతికి తాళాలివ్వడం మంచిదే అన్నమాట' అనుకొన్నాను. అతని ప్రవర్తనకు నాకు కోపం రావడానికి కారణం రామ్మూర్తికి ఆర్థికంగా ఏ యిబ్బందీ లేకున్నా అతను అంత లోభిత్వం చూపించడమే. అతని భార్య బ్యాంకులో పనిచేస్తుంది. బాధ్యతలు, బాదరబందీలు లేవు.

ఇంతలో నాకో ఆలోచన వచ్చింది. రామ్మూర్తి ప్రవర్తించినట్లే నేనూ ప్రవర్తించి అతనికి బుద్ధి చెప్పాలనుకొన్నాను. లిస్టులో నా పేరు రాసి ఎదురుగా రెండువందలు అంకెల్లో వేసి సంతకం పెట్టాను. డబ్బు తర్వాత యిస్తానని చెప్పి అటెండర్‌ని పంపేశాను. ఆరోజు రెండుసార్లు రామ్మూర్తి నా సీటు దగ్గరకి వచ్చి డబ్బులు అడిగాడు. అతను చెప్పిన సాకులే నేనూ చెప్పాను. ఏం మాట్లాడకుండా వెళ్ళిపోయాడు. మా ఆఫీసులో వందమందికి పైగా ఉద్యోగులు ఉండటంతో ఏడువేలకు పైగా వసూలయిందని, ఆ మొత్తాన్ని ఆమెకు ఆ రోజు సాయంత్రమే అందచేశారని తెలిసింది.

ఒకరోజు ఆఫీసుకు రాగానే ఆమె కనిపించింది. నా కోసమే కాచుకొని ఉన్నట్లు నన్ను చూడగానే వడివడిగా సమీపించి "ఆపరేషన్ విజయవంతం అయింది. మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను" అంటూ కన్నీళ్ళతో రెండు చేతులూ జోడించింది.

నాకు సిగ్గేసింది. డబ్బులు సేకరించింది నేను కాదు, రామ్మూర్తి. పైగా నేను ఒక రూపాయి కూడా యివ్వలేదు. మామూలుగా యిటువంటి సందర్భాలలో కనీసం వంద రూపాయలైనా యిచ్చేవాణ్ణి. రామ్మూర్తికి బుద్ధి చెప్పాలని, అవసరంలో ఉన్న ఆమెకు ఆ డబ్బు అందివ్వకపోవడం ఎంతవరకు సమంజసం?"అన్ని ఆఫీసుల్లోకి మీ ఆఫీసులోనే ఎక్కువ మొత్తం వసూలయింది. మీరు నా బాధ ఓపికగా విని, రామ్మూర్తిగారితో చెప్పి ఈ సహాయం చేయించారు. ముఖ్యంగా నాకు ధైర్యం చెప్పారు. ఓ మంచి వ్యక్తి నోటి నుంచి వచ్చే మంచిమాటలు నిజమవుతాయని నేను ఎక్కడో చదివాను. అది నిజమైంది ఈరోజు" అంది ఆమె కృతజ్ఞతగా.

వెంటనే జేబునుంచి ఓ అయిదువందల నోటు తీసి ఆమెకు యిస్తూ "ఉంచండి. మందులకు పనికివస్తుంది" అన్నాను. పంతానికి పోయి మానవత్వాన్ని మరిచానని నన్ను నిలదీస్తున్న నా అంతరాత్మకు సమాధానం చెప్పగలిగానన్న తృప్తి నాకు మిగిలింది.

**-సి.ఎస్.చంద్రశేఖర్**

**(చిత్తూరు)**